# భయం నీడ

పల్లెనించి బైటపడి మట్టి రోడ్డెక్కింది జీపు. దుమ్ముతెరల్ని రేపుకొంటూ టౌనుకేసి దూసుకుపోసాగింది. డ్రైవర్ పక్కసీటులోనే కూచుని ఉన్నాడు ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి. ఆయన వెనక మధ్య సీటులో, చివరి సీటులో గన్‌మెన్ ఉన్నారు. మిగిలినవాళ్లంతా ఆయన అనుచరగణం.

"వాడు చాలించుకుంటాడంటావా?" పక్కవాటంగా తలతిప్పి గన్‌మ్యాన్ పక్కనున్న మనిషిని అడిగాడు ప్రతాపరెడ్డి.

"ఇంకా ఎందుకన్నా అనుమానం? ఆయువుపట్టు దొరికిందిగా! గాలానికి తగులుకున్నె సేప యాడికిబోద్ది?" నవ్వాడా వ్యక్తి.

ప్రతాపరెడ్డికయితే ఇంకా అనుమానంగానే ఉంది. ఎంత రాద్ధాంతం చేశాడనీ చెన్నారెడ్డి ఈ వారం రోజులూ. అదేదో అపురూపమైనదిలా... కోరిన కోర్కెలన్నీ తీర్చే కల్పవృక్షంలా... ఈ లోకానికంతటికీ ఆధారభూతమైందిలా చిత్రీకరించాడు.

తన ఇంటికి ఉత్తరంగా ఉండే పురాతన కాలంనాటి చింతచెట్టును నరికించాడు తను. దాన్నేమీ తన సొంత అవసరాలకు ఉపయోగించుకోలేదు. రెవెన్యూ వాళ్ళచేతనే వేలం పాట ద్వారా అమ్మించాడు.

ఊరు పుట్టకముందునించే చెట్టు ఉందనీ... కొన్నివేల కబోది పక్షులకు ఆశ్రయమిచ్చేదనీ... గ్రామ సంస్కృతికి ప్రతీక అనీ.. దాన్ని తన స్వప్రయోజనాలకు నరికించాడనీ... అదనీ ఇదనీ... నానా యాగీ చేశాడు చెన్నారెడ్డి. పెద్దగాలి వచ్చి పడిపోయినట్టుగా రికార్డు రాయించాడు తను. ఆకల్లాడని సంధిదశ... ఆశ్లేషకార్తెలో పెద్ద గాలి ఎక్కణ్ణించి వస్తుందని - వాళ్ళు రేపట్నుంచి కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని వాళ్లంతా ప్రకటించటం... ప్రతిపక్షాలు మద్దతివ్వటం...

అతని ఆయువుపట్టు దొరకకుంటే ఇబ్బంది అయ్యేదే.

జీపు ఫర్లాంగు దూరం ఉండగానే పక్కకు తప్పుకొంటున్నాయి ఎద్దుల బండ్ల లాంటివి. మోటారు బైకులైతే నిలబెట్టి మరీ దారి విడుస్తున్నారు.

ఆ ఇలాకాలో అందరికీ తెలుసు ప్రతాపరెడ్డి జీపు గురించీ, దాని వేగం గురించీ, దాని లెక్కలేనితనం గురించీ.

"ఈ ఎర్రజెండాల వాళ్ళతో వచ్చే ఇబ్బందే ఇది" అన్నాడు మధ్యసీటు మనిషి.

వ్యక్తిగత విరోధులు కాదు. అధికారాన్ని అడ్డుకొనేవాళ్ళు కాదు. కానీ ఇదో... ఇల్లాంటి విషయాలంటే తీవ్రంగా స్పందిస్తారు.

గుంటల్లో ఎగిరెగిరిపడుతూ ఉంది జీపు. వెనక దుమ్మురేగుతూ ఉంది. ప్రతాపరెడ్డి కళ్ళు సూటిగా రోడ్డునే చూస్తున్నాయి. ఎదురయ్యే వాహనాల్నీ మనుషుల్నీ గమనిస్తున్నాయి. రెండు కిలోమీటర్లు వెళ్లిం తర్వాత హఠాత్తుగా మలుపు. రోడ్డు కన్పించకుండా దట్టంగా పెరిగిన పిచ్చి కంపలతో కూడిన మిట్ట మీదుగా దారి...

ప్రతాపరెడ్డి వెన్నుముక నిటారుగా నీలుక్కొంది. వేగం మందగించిన జీపు కదలికల మీద ఓ కన్నూ... పరిసరాల మీదో మరో కన్నూ.. ఇక్కడికి వచ్చేసరికి ఒళ్ళంతా జలదరిస్తుంది. భయం వెన్నుముక వెంట పాదరసంలా పాకుతుంది. రెండు నెలల్నుంచే ఈ వదరు. ఈ మిట్టమీదే సుబ్బారెడ్డిగాన్ని వెంటబడి, వేటాడి తన మనుషులు నరికి చంపినప్పటి నుండే ఈ అదిరిపాటు.

కంప చెట్లన్నింటినీ కొట్టేయించాలి. దారి శుభ్రంగా కనిపించాలి.

శత్రువులు దాక్కొని దాడి చేసేందుకు అనుకూల ప్రాంతం ఇది. కంపచెట్లను నరికితే సరి. ప్రమాదం చాలా వరకూ తప్పినట్లే.

చింతచెట్టు కూడా అందుకే నరికించాడు తను. తన ఇంటికి అవతల చెట్టుంది - చుట్టూ పాతకాలంనాటి అరుగుతో. చెట్టెక్కితే కొమ్మల మీది నుంచి ఇంటి కాంపౌండ్‌లోకి దిగొచ్చు లేదా కొమ్మల చివరలకు వెళ్ళి అక్కణ్ణించి ఇంట్లో ఏ ప్రాంతానికయినా బాంబింగ్ లేదా షూటింగ్ జరపొచ్చు.

రాత్రి పడుకొంటే చెట్టే కళ్ళముందుండేది. నిద్రొచ్చేది కాదు. అందుకే దాన్ని నరికించాడు. మిట్టమీది కంప చెట్లకు కూడా ఏదో ఒక పని శాంక్షన్ చేయించి తీసేయించాలి.

తన ప్రత్యర్థి చెన్నారెడ్డి కనిపెట్టుకొనే ఉంటాడు. ఇంతవరకూ జరిగిన విషయం వేరు. సుబ్బారెడ్డిని వేసేసిన తర్వాతి సంగతి వేరు. స్వయాన వాని తమ్ముడే అతను. తనను లేపేసేందుకు ఎన్నెన్నో ప్లానులు వేశాడు... అందుకే తనే ఒకడుగు ముందుకేశాడు.

ఏ క్షణంలో ఏవైపునించి దాడి జరుగుతందో చెప్పేదానికి లేదు. అన్నివైపులా జాగ్రత్త పడాలి. తమ ప్రభుత్వమే కాబట్టి ఇద్దరు గన్‌మెన్‌లను కూడా ఇచ్చింది.

తనంటే ఇప్పటికే తాలూకాలో భయం మొదలైంది.

సుబ్బారెడ్డి హత్య తన్నో వీరుడిగా చిత్రించింది. అప్పట్నించే తనకు భయం మొదలైంది.

ఆత్మరక్షణ కోసం ఎన్నెన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తోంది.

ఎదురయ్యే ప్రతి జీపునూ మోటారు బైకునూ వేయి కళ్ళతో పరిశీలించవలసి వస్తోంది. జనాలతో వచ్చే ట్రాక్టర్లూ... టాపు మీద జనముండే బస్సూ ఎదురయితే గుండె దడ. గన్‌మెన్‌ను ప్రతీ చిన్న విషయానికీ అలర్ట్ చేయటమంటే తాను భయపడుతోన్న విషయం వాళ్ళకు తెలిసిపోతుంది. అందుకే ప్రతి ప్రయాణానికీ ముందు వాళ్ళకో చిన్న ఉపన్యాసం లాంటిది ఇస్తుంటాడు.

జీపు టౌన్లోకి ప్రవేశించింది.

ఆఫీసు వద్దకు వెళితే అక్కడి ఉద్యోగులు తనపట్ల చూపించే భయభక్తులకు ముచ్చటేస్తుంది.

అది సుబ్బారెడ్డి హత్య కావొచ్చు... అంతకుమునుపు తను సృష్టించిన కొన్ని భయోత్పాత చర్యలు కావొచ్చు. తన్ను హీరోను చేశాయి. ఎంతలావు ఆఫీసరయినా వంగివంగి దణ్ణం పెట్టే స్థాయికి తెచ్చాయి.

రెండు మూడు ఆఫీసులు తిరిగొచ్చే సరికి మధ్యాహ్నమైంది. ఆఫీసు ముందు ప్రత్యర్థి వాహనం ఉందో లేదో చూసుకోవాలి. ఉంటే - వాళ్ళను బైటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలి.

తను వస్తున్నాడని తెలిస్తే ఆఫీసర్లే వాళ్ళను కాళ్ళా వేళ్ళాపడి మరో దారిగుండా బైటకు పంపి తమను తీసికెళ్తారు. గెస్ట్‌హౌస్‌లో కూడా అంతే - తను దిగుతున్నాని తెలిస్తే తన ప్రత్యర్థులెవర్నీ ఆ ఛాయల్లో ఉండనీరు.

తన ప్రత్యర్థి చెన్నారెడ్డి టౌన్లో లేడని తెలిసి గుండెల మీదినించి కొండంత బరువు దిగినట్లయింది.

నేరుగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు వెళ్లింది జీపు.

మధ్యాహ్న భోజనం తర్వాత మరి కొంతమందిని కలవాలి. వీలైతే ఎంపీ ఇంటికి వెళ్ళిరావాలి. ఆయన ఢిల్లీలో ఉన్నా ఆయన తమ్ముణ్ణి కలిస్తే సరి.

తనవాళ్ళంతా సొంత పనులమీద దిగి వెళ్ళినట్లుంది. కొందరిని తను పంపించాడు ఆఫీసు పనులమీద.

గన్‌మెన్ ఇద్దరూ తోడున్నారు.

భోజనం వేళయింది. తనకు ఆకలిగా లేదు. గన్‌మెన్‌కు చెప్పాడు - భోంచేసి రమ్మని. జేబులోంచి డబ్బు తీసి ఇచ్చాడు. వచ్చేటప్పుడు తనకు పళ్ళు తెమ్మన్నాడు.

లోపలకి వెళ్ళి తలుపేసుకొన్నాడు. తను ఒంటరిగా ఉన్న విషయం అప్పుడు గుర్తొచ్చింది. చెన్నారెడ్డి టౌన్లో లేడనే విషయం ధైర్యాన్నిచ్చింది. చిన్నగా నవ్వుకున్నాడు.

తను తిరిగివచ్చిన ఆఫీసు విషయాలూ ఆఫీసర్ల విషయాలూ గతంలోకంటే ఇప్పుడు సులభంగా వేగంగా పనిజరిగే తీరూ - మననం చేసుకొంటుంటే - దీనికంతటికి కారణం సుబ్బారెడ్డిని తను చంపించటమేనని గట్టిగా అనిపించింది. వద్దనుకొంటున్నా అవే విషయాలు.... అటుదిరిగి ఇటుదిరిగి అక్కడికే ఆలోచనల పయనం...

చెన్నారెడ్డిని గురించి సేకరించిన సమాచారం నిజమే అయితే ఫర్వాలేదు... తప్పుడు సమాచారమైతే?

లోపలెక్కడో ఉలికిపాటుకు గురయింది మనసు. దాని స్పందనలు అలలు అలలుగా తోసుకొస్తూ ఊపిరిదాకా - ఎదలో గాభరా.

లేచి తలుపు తెరిచి జీపుకేసి చూశాడు.

డ్రైవర్ కూచుని ఉన్నాడు.

"సుభాన్! నువ్వు పోలేదా?"

తలెత్తుతూ జీపులోంచి దిగాడు అతను.

"వాల్లొచ్చినాంక పోతాలేయ్యా!"

తలూపి మళ్ళీ లోనికి నడిచాడు ప్రతాపరెడ్డి. సెల్ మోగింది.

"హలో హలో... ఎనీబడీ దేర్..." అంటూ రింగ్‌టోన్.

కలెక్టరేట్ నుంచి ఫోన్.

వెంటనే వెళ్ళి కలెక్టర్ని కలవాలట. రెండు గంటలకు ఆయన హైదరాబాదు వెళుతున్నాడట. తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చింది నాలుగ్గంటలకు. ప్రోగ్రామ్‌లో అనుకోని మార్పు. వాచీ చూసుకొంటే అప్పటికే ఒంటిగంట దాటింది. చెప్పుల్లో కాళ్ళు

దూర్చి బైటకు రాబోతూ ఆగాడు. జీపుంది... డ్రైవరయితే ఉన్నాడు. గన్‌మెన్ లేదు గదా!

మరో పది నిమిషాలు అసహనంగానే నిరీక్షించాడు. చాలా ముఖ్యమైన కార్యక్రమం. కీలకమైన ఆర్థిక విషయాలతో ముడిపడిన సంగతి. వెళ్ళాలి... వెళ్ళి తీరాలి. సమస్య తీవ్రత ఎద లోపల రగులుతూ ఉంది.

జీపేసుకుని వెళ్ళిపోదామని ముక్కుపుటాలదాకా ఆవేశం... ఆ వెనకే చెన్నారెడ్డిని గురించి భయం గుండె లోపల్నించి తన్నుకొస్తూ – 'ఛ...' కాలిని నేలకేసి తన్నాడు. ఏం చేయాలో అర్థం కాలేదు. సరిగ్గా కిలోమీటరు దూరం కూడా ఉండదు ప్రయాణం.

సమయం కొలిస్తే రెండు నిమిషాలే! గన్‌మెన్ మీద కోపం రగులుతూ ఉంది. భోజనానికి వెళ్ళి అర్ధగంట కావొస్తోంది. ఒక్కడే వెళదామంటే గుండెలు చాలటం లేదు. తోడు లేకుండా వెళ్ళలేని పరిస్థితి. తనమీద తనకే జాలేసింది.

వెంట జనం లేకుండా వెళ్ళలేని తన దయనీయస్థితిని తల్చుకొని తనకే సిగ్గేస్తోంది. గన్‌మెన్ ఆలస్యంపట్ల కోపం ఎక్కువైంది. ఆవేశంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"ఎట్టబోయినారు నా కొడుకులంతా? ఒక్కడూ లేడు... యాడికి సచ్చిన్రు... ఈ నాకొడుకుల తోడు లేకుండా బైటికి పొయ్యేదానికే లేదు. థూ... ఏం బతుకో? ఆ చెన్నారెడ్డిగాన్ని ఏసేస్తేగానీ నాకీ బాధ తప్పేట్టులేదు..." కసిగా తిట్టుకొంటూ అటూ ఇటూ పచార్లు చేస్తూ మండిపడుతున్నాడు.

మరో పది నిమిషాలకు గన్‌మెన్ వచ్చారు. కోపమంతా తీరేలా తిట్టాలనిపించింది. వాళ్ళను చెడ్డ చేసుకోవటమెందుకని లోపల్లోపల గొణుక్కొంటూ జీపెక్కాడు.

అతనికి నిలువెల్లా అంతులేని అసహనంగా ఉంది. తన స్వేచ్ఛలేనితనం పట్ల అసహనం... తనను అనుక్షణం బెదిరిస్తూ ఉండే చావుపట్ల అసహనం... ఎంతమేపినా సమయానికి అక్కరకురాని జనంపట్ల అసహనం...

తనకు తానుగా ఎక్కడికీ వెళ్లేందుకు లేదు. అది ఎంత ఆంతరంగిక విషయమైనా తుపాకుల మధ్య వెళ్ళాల్సిందే.

పెళ్ళయిన కొత్తలో పొద్దుగుంకేదాకా సేద్యంజేసి ఆదరా బాదరా ఇంటికెళ్ళి స్నానంజేసి, అప్పుడు దారిబట్టి డ్రామా పద్యాలు పాడుకుంటూ పదిమైళ్ళు నడిచి అత్తగారి ఊరు చేరుకొనేవాడు. రాత్రి పెళ్లాంతో గడిపి తెల్లారకముందే లేచి మళ్ళీ ఒక్కడే నడుచుకొంటూ తన ఊరికి వచ్చి పనుల్లో కలుసుకొనేవాడు. తన రాకడ, పోకడ ఎవ్వరికీ తెలిసేది కాదు. ఎంత స్వేచ్ఛ...! కల్లాల్లో మంచమేసికొని తెల్లార్లూ హాయిగా నిద్రబోయే స్వేచ్ఛ మళ్ళీ వస్తుందా?

కలెక్టరుతో మాట్లాడి వచ్చిం తర్వాత మరో రెండు ఆఫీసులు తిరిగాడు.

అప్పటికే పొద్దుగూకింది. గన్‌మెన్ ఇద్దరే తనవెంట ఉన్నారు.

ఈ సమయంలో పల్లెకు వెళ్ళేందుకు మనసు ససేమిరా అంటోంది. నేరుగా రాయచోటి దారిబట్టించాడు జీపుని.

మరోగంటలో అక్కగారి ఊరు చేరుకున్నాడు. అక్క కళ్ళల్లో సంతోషాన్ని చూసి ఆనందించాడు.

అమెరికాలోని మేనల్లుని గురించి మాట్లాడుకొన్నారు.

రాత్రిపూట గన్‌మెన్‌కు దూరంగా మిద్దెమీద ప్రశాంతంగా నిద్రబోయాడు. ఏ జామైందో... చుక్క పొడిచిందో... తెల్లారిందో... తన్నెవరో పట్టి కుదుపుతున్నట్లుగా అన్పించి కళ్ళు తెరిచాడు.

"ప్రతాపుడూ! ఓబ్బీ! ఏంటిరా కలవరిస్తాండవు? నిద్దర్లో కూడా సంపుకోడాలూ కొట్టుకోడాలూ ఏందిరా?"

ఎదురుగా అక్క – ప్రేమగా.... ఆప్యాయంగా.... సిగ్గుగా అనిపించింది అతనికి.

"ఏంలేదులేక్కా!" నవ్వుతూ చెప్పి మళ్ళీ పడకేశాడు.

తర్వాత నిద్రపట్టలేదు అతనికి.

చెన్నారెడ్డిని చంపమనో, పొడవమనో కలవరించినట్టుంది తను.

తన ప్రమేయం లేకుండానే మనస్సులోని భయంపట్ల జాగ్రత్తలు...

తనంటే అందరూ భయపడుతున్నారు. చెన్నారెడ్డి వర్గాన్ని అణగదొక్కేందుకు క్రూరమైన పనులు చాలా చేసి ఉన్నాడు తను. అన్నిటికి పరాకాష్ఠ అతని తమ్ముడు సుబ్బారెడ్డిని చంపటం. తన చర్యలతో జనం వణికిపోతున్నారు. ఆ విషయం స్పష్టంగా అర్థమవుతూనే ఉంది.

అయితే జనానికి అర్థంకానిది – ప్రత్యర్థి వర్గం మీద దాడులు ప్రారంభించినప్పటి నుంచి తనలో భయం ప్రారంభమైందనే విషయం.

ఆ భయమే క్రమేణా పెరిగి ప్రత్యర్థి వర్గాన్ని తుడిచివేస్తే తప్ప తను బతకలేననే దాకా వచ్చింది.

ఆ భయమే సుబ్బారెడ్డిని చంపింది.

అవతల మనిషి చావటంతోనే తనకూ చావుభయం పట్టుకొంది.

రాత్రిళ్ళు సరిగ్గా నిద్ర రాదు.

ఆరుబైట పడుకోవటం కలగా మిగిలిపోయింది.

ఏ మనిషినీ నమ్మలేని స్థితి. తనను నమ్మకంగా పెంచిన ఇంటినీ... ఆప్యాయంగా చూచుకొన్న గ్రామాన్నీ...ఆత్మీయంగా పలుకరించే పల్లె రోడ్లనూ... దేన్నీ నమ్మలేని పరిస్థితి.

డబ్బూ హోదా పెరిగేకొద్దీ అభద్రతా భావం కూడా పెరుగుతోంది.

దాన్నించి తప్పించుకోలేని జీవితం. అక్క ఇంట్లో ఏ భయమూ లేకుండా ఎంత హాయిగా అదమరిచి నిద్రబోయాడనీ!

తనకు తెలీకుండానే కలవరించాడుట. తన స్వంత ఊర్లో మేల్కొనే కలవరిస్తున్నాడు – ఇక్కడ నిద్రబోయి – అంతే తేడా.

ఈపాటి నిద్రకయినా తను నోచుకోలేకున్నాడు. అనుక్షణం అతనే కళ్ళముందు మెదలుతూ... తన మనశ్శాంతిని వెంటాడుతూ... తనకు వ్యక్తిగత జీవితం లేకుండా చేస్తూ... సుఖనిద్ర లేకుండా చేస్తూ...

వాణ్ణి... ఆ చెన్నారెడ్డిగాణ్ణి వేసేస్తే గానీ తను నిద్రబోలేడు. తల విదిలిస్తూ లేచి కూచున్నాడు ప్రతాపరెడ్డి.

భయం రెండంచుల కత్తి అయి... బొడ్లో గుచ్చుకొంటూ ఉంటే... పిట్టగోడదాకా వెళ్ళి గన్‌మెన్ కోసం, జీపు కోసం చూశాడు.

◆ *ఈనాడు ఆదివారం – 23 ఏప్రిల్, 2006* ◆